క్లుప్తంగా

మేరీ మట్టి.. మేరా దేశ్‌కు విద్యార్థుల ఎంపిక



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

వైవీయూ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'మేరీ మట్టి.. మేరా దేశ్' కార్యక్రమానికి కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు చరణ్‌తేజ, శ్రీధర్, సంతోష్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్ తెలిపారు.ఢిల్లీలో నిర్వహించే అమృత్ కలశ యాత్రలో పాల్గొన్నారన్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా జాతి సమైక్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్ మణికంఠ మాట్లాడుతూ ఢిల్లీలో నిర్వహించే అమృత కలశయాత్రలో జిల్లాకు చెందిన పలువురు యువకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.ఎం.రమేష్, డా.వై.సావిత్రి, శివరామకృష్ణ, డా.ఎ.నాగరాజు, అధ్యాపకులు డా.పి.రవిశేఖర్, బయపురెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ షరీఫ్

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికట్టాలని కడప డీఎస్పీ షరీఫ్ పేర్కొన్నారు. రాయల్ రసీద్ అసోసియేషన్ ముద్రించిన ట్రాఫిక్ నిబంధనల పోస్టర్స్‌ను తన కార్యాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న పిల్లలకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను ఇవ్వద్దన్నారు. అతివేగంగా వాహనాలను నడిపి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయల్ కరీముల్లా, పాల్గొన్నారు.

సాహితీ స్రవంతిలో చురుకైన పాత్ర



మస్తాన్ వలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆప్‌కీ ఆవాజ్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా.. సాహితీ స్రవంతిలో మస్తాన్‌వలి చురుకైన పాత్ర పోషించారని ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా అన్నారు. కడప నగరంలోని ఆప్ కీ ఆవాజ్ కార్యాలయంలో సీనియర్ పాత్రికేయులు మస్తాన్‌వలి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపి బ్రౌన్‌లో సభ్యుడిగా ఉంటూ కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీలో పరిచయం ఉన్న పుస్తకాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడకోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆబిద్ హుస్సేన్, జిలాన్, మైను, జమ్రుత్, కరీమున్, చాంద్ బేగం, ఆంజనేయులు, వెంకటేష్, అన్వర్, జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 5 నుంచి జీపు జాతా



జీపు జాతా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నవంబరు 5వతేదీ నుంచి 15వ తేదీ వరకు జీపు జాతా నిర్వహిస్తున్నట్లు రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కోరారు. స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో జీపు జాతా పోస్టర్స్‌ను గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన మదనపల్లె పట్టణం నుంచి జీపు జాతా ప్రారంభమై పీలేరు, తంబాలపల్లె, రాయచోటి, బద్వేల్, మైదుకూరు, పొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం, కడప నియోజకవర్గాల మీదుగా వెళ్తుందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యల పరిష్కారం, రెగ్యులర్ వార్డెన్ల నియామకంపై దృష్టి పెడతామన్నారు. విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హరి, సంతోష్, ప్రేమసాగర్, రామ్మోహన్ పాల్గొన్నారు.

చేతిరాతపై ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అరవిందాశ్రమంలోని ఎస్ఎం స్కిల్ హబ్‌లో విద్యార్థులకు ఉచితంగా చేతిరాతపై శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకురాలు మౌనిక ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు శిక్షణ తరగతులుంటాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9502890722 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

కేఎంసీ భవనానికి సొబగులు



గ్రౌండ్ ఫ్లోర్‌లో పునర్నిర్మాణమవుతున్న కొత్త చాంబర్లు



కౌన్సిల్ హాల్ రూపురేఖలు మార్చేందుకు సిద్ధం చేసిన పరికరాలు

రూ.3కోట్లతో అభివృద్ధి పనులు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ కార్యాలయ భవనానికి సరికొత్త సొబగులు దిద్దుతున్నారు. సుమారు రూ.3 కోట్లతో పునర్నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి.

ఇప్పటికే కార్యాలయం రెండో అంతస్తులోని కాన్ఫరెన్స్ హాల్‌ను రూ.50 లక్షలతో, మూడో అంతస్తులోని సమావేశ మందిరాన్ని రూ.45 లక్షలతో సెంట్రల్ ఏసీతో అత్యాధునికంగా తీర్చిదిద్దారు. మూడో అంతస్తులోని కౌన్సిల్ హాల్‌ను రూ.50లక్షలతో సరికొత్తగా నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వాటితోపాటు టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, సచివాలయం, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు రూ.1.50 కోట్లతో సైడ్ వాల్స్, జిగేల్ మనేలా లైట్లు, ఏసీలు ఏర్పాటుచేసి కార్పొరేట్ ఆఫీసులా మారుస్తున్నారు. ఇప్పటికే ఒక డీజిల్ జనరేటర్ ఉండగా, రూ.10 లక్షలు వెచ్చించి మరో డీజిల్ జనరేటర్‌ను కొనుగోలు చేశారు. ఆటోమేటిక్‌గా కరెంట్ వచ్చేలా చేసేందుకు దీనిని కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఫర్నిచర్, కంప్యూటర్లు, సీసీ టీవీలు ఇతరత్రా వస్తువుల కోసం మరింత ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. అన్ని విభాగాలు సరికొత్తగా రూపుదిద్దుకుంటుండటంతో పరిసరాలన్నీ పాత వస్తువులతో నిండిపోయాయి. తలుపులు, కిటికీలు, చెక్క సామాగ్రి, పాత ఏసీలు ఎక్కడ చూసినా కన్పిస్తున్నాయి.

ల్యాబ్‌లు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



ఆర్ఐవో రమణరాజుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ల్యాబ్ సౌకర్యం కల్పించని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఇంటర్ ఆర్ఐవో రమణరాజును గురువారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కడప నగరంతోపాటు ప్రొద్దుటూరు, బద్వేల్, మైదుకూరు, పులివెందుల ప్రాంతాల్లో కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు వేలాది రుపాయల ఫీజులు వసూలు చేస్తున్నా విద్యార్థులకు ల్యాబ్ సౌకర్యం కల్పించడం లేదని ఆరోపించారు. ఆర్ఐవో సంబంధిత కళాశాలలను తనిఖీ చేసి ల్యాబ్ సౌకర్యం లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చరణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య విగ్రహానికి స్థానచలనం



అన్నమాచార్యుల విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ హైస్కూలు సెంటర్‌లోని అన్నమాచార్యుల విగ్రహానికి స్థాన చలనం కలిగింది. అర్చక సంక్షేమ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విజయభట్టర్ ఆధ్వర్యంలో సుధీర్ శర్మ, ఇంద్రగంటి ప్రభాకర్‌శర్మ గురువారం విగ్రహం వద్ద విశేష పూజలు జరిపి ప్రాణవాహనం చేశారు. అనంతరం సమీప రామాలయంలో నిత్య పూజల విగ్రహం వద్ద ఉంచారు. కార్పొరేటర్లు సూర్యనారాయణ రావు, శివకేశవరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు బండి బాబు, టౌన్ ప్లానింగ్ అధికారి నాగేంద్ర మాట్లాడుతూ నగర సుందరీకరణలో భాగంగా పలు కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో విగ్రహాలకు స్థాన చలనం కలుగుతోందన్నారు. 1983లో ఏర్పాటు చేసిన అన్నమాచార్యుల విగ్రహాన్ని ప్రస్తుతం 15 అడుగుల వెనుక ఉంచుతున్నట్లు తెలిపారు. కూడలి సుందరీకరణ పూర్తికాగానే 30 అడుగుల నూతన విగ్రహాన్ని పాత విగ్రహంతోపాటు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా వారే అన్నమయ్య విగ్రహాన్ని తొలగించే బాధ్యత తీసుకోవడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

28న జీఎస్టీపై అవగాహన సదస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప డివిజన్‌లో ఈ నెల 28న సాయంత్రం మూడు గంటలకు అప్సర్ సర్కిల్‌లోని శ్రీనివాస రెసిడెన్సీలో వాణిజ్యపన్నుల శాఖ ట్రేడ్ అడ్వయిజరీ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని వాణిజ్య పన్నులశాఖ సంయుక్త కమిషనర్ కె.కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. స్టేట్ మెంబర్స్, చార్టెడ్ అకౌంట్స్, డీలర్లకు జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించనున్నామని తెలిపారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

కడప కార్పొరేషన్ : కడప నగరంలో విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం వినియోగదారుల పాలిట శాపంగా మారింది.

కడప నగరంలోని గంజికుంట కాలనీలో కొత్త మీటర్ కనెక్షన్ కోసం ఓ కుటుంబం సుమారు 20 రోజుల క్రితం రూ.4వేల డబ్బు చెల్లించింది. నిబంధనల ప్రకారం ఒకట్రెండు రోజుల్లో కనెక్షన్ ఇవ్వాల్సిన అధికారులు.. కాలయాపన చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇదేమిటని అడిగితే 'లైన్‌మెన్ కాసింత చల్లారాలి' అంటూ ఏఈ స్థాయి అధికారులే మాట్లాడుతుండడం విచారకరం. దీనిపై ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినా చలనం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి సకాలంలో సేవలదించేలా చూడాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఏడీఈ నాయక్ వివరణ కోరగా తన దృష్టికి తెస్తే సమస్య పరిష్కరిస్తానని చెప్పడం గమనార్హం.

గ్రామీణ యువతకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ గ్రామీణ యువతకు డ్రోన్ సర్వీస్ టెక్నిషియన్ కోర్సులో నాలుగు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 19–28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి టెన్త్ ఉత్తీర్ణులై డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పాస్/ఫెయిలైన నిరుద్యోగులు శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. ఈ నెల 30వ తేదీన కడప రామకృష్ణ హైస్కూల్‌లో శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ప్రతి విద్యార్థికి వ్యక్తిత్వ వికాసం, కంప్యూటర్ స్కిల్స్, స్పోకన్ ఇంగ్లీష్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

నేడు చలో మైదుకూరు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రైతు సమస్యలపై శుక్రవారం చలో మైదుకూరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు పేర్కొన్నారు. నగరంలోని ఇందిరాభవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కరవు విలయతాండం చేస్తోందని, కూలీలకు పనులు లేక వలస వెళుతున్నారని తెలిపారు. రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చి వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలన్నారు. ఈ ర్యాలీ మైదుకూరులోని షిరిడి సాయి ఆలయం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్, వనిపెంట జంక్షన్ మీదుగా సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోపూరు వెంకటరమణారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మధు రెడ్డి, నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బాబు, మహమ్మద్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

రుణాలివ్వాలంటూ.. రైతుల నిరసన



సహకార బ్యాంకు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రైతులకు సకాలంలో రుణాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేసీ.బాదుల్లా, జిల్లా సమితి సభ్యులు టక్కోలి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. రైతులతో కలిసి స్థానిక సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ రుణ మంజూరులో నిర్లక్ష్యం వహిస్తున్న సహకార బ్యాంకు సూపర్ వైజర్ రామాంజనేయులుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలంఖాన్‌పల్లె సొసైటీ ద్వారా బ్రాహ్మణపల్లికి చెందిన 17 మంది రైతులకు రుణాలివ్వాలని సూపర్‌వైజర్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సహకార బ్యాంకు సీఈవో రాజేంద్ర కుమార్, డిప్యూటీ మేనేజర్ ప్రతాప్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, మైనుద్దీన్, మధుసూదన్ రెడ్డి, ఓబుళరెడ్డి నారాయణ, ఓబులేసు, రామకృష్ణ, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమాధులను తొలగించవద్దు



జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఇమ్రాన్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న సురేష్, తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మాసాపేటలోని శ్మశానంలో దొరల సమాధులను తొలగించకుండా నిర్మాణాలు చేపట్టాలని క్రైస్తవ సేవకులు, నాయకులు కోరారు. కడప కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ ఇమ్రాన్‌ను గురువారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ కడపలోని దొరల సమాధులకు విశేష చరిత్ర ఉందని, వాటిని అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద రావు, కిరణ్, జాన్, నందు, మోషె, మాణిక్యాల రావు, ఏసోబు, నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కళలతో సామాజిక ప్రగతి



తొగట వీర క్షత్రియ చైతన్య గీతావిష్కరణలో పాల్గొన్న మేయర్ సురేష్‌బాబు

కడప రూరల్ : కళలతో సామాజిక ప్రగతి సాధ్యపడుతుందని కడప నగర మేయర్ కె.సురేష్ బాబు అన్నారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో తొగట వీర క్షత్రియ చైతన్య దృశ్య శ్రవణ గీతాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ స్వాతంత్య్ర సంగ్రామంలోనూ ప్రాచీన కళలు ప్రముఖ పాత్ర పోషించాయన్నారు. కళా రూపాలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తొగట వీర క్షత్రియ చైతన్య గీతంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, సాదక బాధకాలను కళ్లకు కట్టినట్లు చూపించడం ప్రశంసనీయమన్నారు. చైతన్య గీతాన్ని సూరిబాబు అద్భుతంగా తెరకెక్కించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం చైతన్య గీతంలో పాల్గొన్న సాంకేతిక నిపుణులను అభినందించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, గోవిందు నాగరాజు, మల్లికార్జున, రామలక్ష్మిరెడ్డి, విజయభాస్కర్, ఉప్పు శంకర్, లక్ష్మినారాయణ, సునీల్ జయంత్, తదితరులు పాల్గొన్నారు.

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనులు వేగవంతం



గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని పుట్లంపల్లిలో నిర్మిస్తున్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనులు వేగవంతం చేయాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా పుట్లంపల్లి, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఉక్కాయపల్లె, వినాయకనగర్ ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. పుట్లంపల్లిలో కంపోస్టు ఎరువు తొట్లను పరిశీలించి, వ్యర్థపు నీరు పోయేందుకు డ్రైనేజీ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ బాటిల్స్ ద్వారా పూల కుండీలు తయారు చేసి, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద మొక్కలు నాటించాలన్నారు. అనంతరం 16వ డివిజన్ మామిళ్లపల్లె సచివాలయాన్ని తనిఖీ చేసి కార్యదర్శుల హాజరు పట్టిక, సర్వీసు రిజిస్టర్ పరిశీలించారు. సచివాలయంలో మరుగు దొడ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఉద్యోగులు అనుమతి లేకుండా గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏఎఫ్ఏయూ సెమిస్టర్ పరీక్షలు



సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

వైవీయూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ లోని టౌన్ ప్లానింగ్,బిల్డింగ్ టెక్నాలజీస్, కన్స్‌ట్రక్షన్ టెక్నాలజీస్ మేనేజ్‌మెంట్, గేమ్ డిజైన్ టెక్నాలజీస్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్, కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్స్, యానిమేషన్, స్కల్ప్చర్, ఆర్ట్ హిస్టరీ విభాగాలకు 3వ, 7వ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.అంజనేయ ప్రసాద్ పరీక్ష గదులను తనిఖీ చేశారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.అంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

నవంబరు 3 నుంచి నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష



మాట్లాడుతున్న ఎంఈఓ పాలెం నారాయణ

కడప ఎడ్యుకేషన్ : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను పక్కాగా నిర్వహించాలని కడప ఎంఈఓ పాలెం నారాయణ సూచించారు. కడప సీఎస్ఐ స్కూల్‌లో న్యాస్ పరీక్షకు ఎంపిక చేయబడిన ప్రధానోపాధ్యాయులకు గురువారం ఒక్క రోజు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 3వతేదీ ఎంపిక చేయబడిన పాఠశాలల్లో 3, 6, 9వ తరగతులకు నిర్వహించే సర్వే పరీక్షను చాలా పక్కాగా నిర్వహించాలన్నారు. సీఆర్‌పీలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో వ్యాసరచన పోటీలు



బెటాలియన్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న పోలీసులు

సిద్దవటం : పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో గురువారం విద్యార్థులకు, పోలీసు ఆఫీసర్‌లకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంటు శ్రీనివాసరావు అదేశాల మేరకు బెటాలియన్ లోని లెక్షరర్ హాల్‌లో పోలీసు ఆఫీసర్ సిబ్బందికి, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ మోసాలను నిరోధించడంలో సాంకేతికత గురించి, బెటాలియన్‌లో ఉన్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థుకు, పోలీసు సిబ్బంది పిల్లలకు లైంగిక వేధింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణ సామాజిక ప్రాత అనే అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అసిస్టెంటు కమాండెంటు కె.వెంకట్‌రెడ్డి, విజయప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షిస్తాం



వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీన దస్తగిరిని సన్మానిస్తున్న మన ప్రజా సేవా సమితి సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : జిల్లాలో వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తానని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి తెలిపారు. మన ప్రజా సేవా సమితి కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు ఆస్తులను అధికారులతో మాట్లాడి తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. అనంతరం వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, సర్పంచ్ గౌస్ లాజం, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి యాకూబ్‌లకు శాలువా కప్పి మెమెంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మన ప్రజా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ అయూబ్‌ఖాన్, గౌరవాధ్యక్షుడు అరబ్‌సా, ఉపాధ్యక్షుడు సలీం, కోశాధికారి మహమూద్, ఎంపీజే రాష్ట్ర సహాయ కార్యదర్శి సలీం, ఇన్ఫోటిక్ టూర్ అండ్ ట్రావెల్ అధినేత షేక్షావలి, అల్లాబకాష్, షరీఫ్, గఫర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. 'ఆరోగ్య సురక్ష' పథకం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



పెండ్లిమర్రి : కంటి వైద్య పరీక్షలపై వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండల పరిధి మాచునూరు గ్రామ పంచాయతీలోని చౌటపల్లె హైస్కూల్‌లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వైద్య సేవల కోసం ఇబ్బందులు పడకూడదని, అందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నడవలేనివారు, వృద్ధులు, వయసు మళ్లిన వారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సదుపాయం అందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వం అన్న నినాదంతో ప్రజల వద్దకే వెళ్లి అక్కడే వైద్య సేవలు అందించడం జరుగుతోందని తెలియజేశారు. ఆరోగ్య సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు, అందరూ సమన్వయంతో గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి అక్కడ ఎవరెవరికి ఏ సమస్యలు ఉన్నాయో గుర్తించి వారికి అక్కడే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారికి అన్ని పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, మండల బూత్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సంతోష్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయ భాస్కర్‌రాజు, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సదుపాయాలు

చెన్నూరు : ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మండల స్పెషల్ ఆఫీసర్ సీహెచ్ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ అన్నారు. గురువారం కనపర్తి గ్రామంలో సర్పంచ్ నారాయణమ్మ, ఎంపీటీసీ రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వైద్య శిబిరానికి వచ్చిన వారిని పలుకరించి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని విభాగాలకు సంబంధించిన డాక్టర్లను ఒకే చోటికి తీసుకురావడం జరిగిందని, దీని ద్వారా ప్రతి ఒక్కరికి సులభంగా వైద్య సదుపాయం అందేలా చూడడం జరిగిందన్నారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో గర్భవతులకు సీమంతాలు ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో కంటి అద్దాలు పంపిణీ చేశారు. మరికొంత మందిని మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రులకు పంపించారు. 400 మందికి డాక్టర్ బి.చెన్నారెడ్డి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే మండల వ్యాప్తంగా 8 సచివాలయాల పరిధిలో మొత్తం 3258 మందికి వైద్య సేవలు అందించడంతోపాటు వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.